# అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న నేస్తం వచ్చేంతవరకు మా పోరాటాలు ఆపం



✷ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

**ధర్మవరం,సెప్టెంబర్ 07 (పెన్ సత్తా)** అర్హులైన చేనేత కార్మికులకు నేతన్న నేస్తం వచ్చేంతవరకు మా పోరాటాలు ఆపము అని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి స్పష్టం చేశారు.ఈ సందర్భంగా వారు పట్టణంలో గుడ్ మార్నింగ్ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఇంటింటా వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేతన్న నేస్తం లో రాని వారి ఇండ్లకు వెళ్లి అసలు విషయాన్ని తెలుసుకోవడం జరిగింది.అనంతరం కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ,నేతన్న నేస్తం 25 వేల రూపాయలు సగముకు పైగా అవకతవకలు జరిగాయని,ఇందుకు మా దగ్గర ఆధారాలు కూడా ఉన్నాయని తెలిపారు.నిజమైన నేతన్నలకు డబ్బు రాలేదని,రెక్కాడితే డొక్కాడని చేనేత కార్మికులను ఈ విధంగా మోసం చేయడం ప్రభుత్వానికి తగదు అని వారు హితవు పలికారు. అదేవిధంగా డీఎస్సీలో సిబిఐ విచారణ ఎందుకు చేయటం లేదని నారా లోకేష్ ను ప్రశ్నించారు.మా జగన్ మోహన్ రెడ్డి హయాంలో ఏపీపీఎస్సీలో అవ్వక తవ్వకాలు జరిగిన వెంటనే సిబిఐ విచారణను చేపట్టమని మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆదేశించిన విషయాన్ని వారు గుర్తు చేశారు. మున్సిపల్, పంచాయతీ ఎలక్షన్స్ వస్తున్నాయని,దీని ద్వారా మరింత మోసం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని తెలిపారు.మున్సిపల్ పంచాయతీ ఎన్నికల్లో వైఎస్ఆర్సిపి విజయం ఖాయమని తెలిపారు. ఇప్పటికే ఎన్ డి ఏ ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు అయిందని, సమస్యలు పరిష్కారం కాక అలాగే ఉన్నాయని వారు ఎద్దేవా చేశారు. భవిష్యత్తులో అన్ని సమస్యల పైన వైఎస్ఆర్సిపి పార్టీ పోరాటం చేస్తుందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు,వార్డు ఇంచార్జ్ లు, నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# 82 వ వార్డులో అభివృద్ధి పనుల పై ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ పర్యటన.

**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 07:**మాజీ మంత్రి, శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ 82 వ వార్డులో విస్తృత పర్యటన నిర్వహించారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచే గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు, పూర్తయిన అభివృద్ధి పనులను పరిశీలించి, జరుగుతున్న మంజూరైన పనుల పురోగతిని అధికారులతో సమీక్షించారు.

కూటమి ప్రభుత్వం ఏర్పడిన గత రెండు సంవత్సరాల్లో 82 వ వార్డులో సుమారు 41 అభివృద్ధి పనులకు రూ.16.59 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో జరిగిన అభివృద్ధితో పోలిస్తే, కూటమి ప్రభుత్వం కేవలం రెండు సంవత్సరాల్లోనే విస్తృత స్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు. గాంధీనగర్, అంజయ్య కాలనీ, విజయరామరాజుపేట, శ్రీరామ్‌నగర్ కాలనీ, పెదరెల్లి వీధి, చవితిన వీధి, నర్సింగరావుపేట, పల్లివారి దొడ్డి తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టులు, కమ్యూనిటీ హాళు ్లు, ఎన్టీఆర్ గ్రౌండ్లో బౌండరీ వాల్ తదితర పనులు చేపట్టారు. శ్రీరామ్‌నగర్ కాలనీలో రూ.45 లక్షలతో కమ్యూనిటీ హాల్, పెదరెల్లి వీధిలో రూ.75 లక్షలతో కమ్యూనిటీ హాల్, ఇతర ప్రాంతాల్లో రోడ్లు--డ్రైన్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అలాగే వైసీపీ పాలనలో నిర్లక్ష్యానికి గురైన రావు గోపాలరావు కళాక్షేత్రాన్ని సుమారు రూ.5 కోట్లతో పునరుద్ధరించి ప్రజలకు అందుబాటు లోకి తీసుకురావడం జరిగిందని తెలిపారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించి, తక్షణ పరిష్కారం సాధ్యమైన వాటిని అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు, దీర్ఘకాలిక సమస్యలకు టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని జివిఎంసి అధికారులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆదేశించారు.







కొణతాల అంటే అభివృద్ధి, అభివృద్ధి అంటే కొణతాల అన్న విధంగా 82 వ వార్డులో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని నాయకులు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో అనకాపల్లి నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.

# గ్రామీణాభివృది పనుల పై ప్రత్యేక దృష్టి సారించాలి కలెక్టర్.





## మండలాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి.

**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబరు 07:** జిల్లాలో అన్ని మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అన్నారు.


జిల్లాలో 70% ప్రజలు వ్యవసాయం పై ఆధారపడి జీవిస్తున్నారని, వారికి ప్రయోజనం చేకూరే విధంగా ఇరిగేషన్ అధికారులు వ్యవసాయ అధికారులు ఎంపీడీవోలు నిరంతరం పనిచేయాలని విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ నుంచి మండల అభివృద్ధి అధికారులు, ఉప మండల అభివృద్ధి అధికారులు, గ్రామీణ నీటి సరఫరా శాఖ (ఆర్డబ్ల్యుఎస్), అగ్రికల్చర్, విద్యుత్ శాఖ, డి ఆర్ డి ఎ, డిపిఓ, ఇరిగేషన్ అధికారులతో జిల్లా కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి, తాగునీటి సరఫరా, విద్యుత్ సౌకర్యాల నిర్వహణ, గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్యం, మౌలిక వసతుల కల్పన, ప్రభుత్వ పథకాల అమలు తదితర అంశాల పై జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా పోలవరం, తాగునీరు, విద్యుత్ సరఫరా అంశాల పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రాబోయే ఒక వారంలో పోలవరం నీటి ప్రాజెక్టుకు సంబంధించిన 3-సభ్యుల కమిటీ నివేదిక పై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇంటి ఇంటి చెత్త సేకరణ (డోర్ టు డోర్ కలెక్షన్)ను ప్రతిరోజూ క్రమం తప్పకుండా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో పారిశుధ్యాన్ని, వీధి లైట్లు నిర్వహణ మెరుగుపరిచేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, కలెక్టర్ ఆదేశించారు. తాగునీటి నాణ్యత పై నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. నీటి పరిమాణంతో పాటు నాణ్యతలోనూ ఎటువంటి రాజీ పడబోమని, రోజూ పిఆర్ 5 యాప్‌లో క్లోరినేషన్ నివేదికలను తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఆర్డీఎస్ఎస్ ప్రాజెక్ట్: గత వారం రోజులుగా వివిధ ప్రాంతాల్లో ఎదురవుతున్న విద్యుత్ కొరత, వోల్టేజ్ సమస్యల నివారణకు ఆర్డీఎస్ఎస్ (రైతు, గృహ విద్యుత్ మార్గాల వేర్వేరు సరఫరా) పనులను వేగవంతం చేయాలని తెలిపారు. రూ. 300 కోట్లతో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా వ్యవసాయ రంగానికి ఇచ్చే ఉచిత విద్యుత్ మార్గాలను, గృహ విద్యుత్ మార్గాల నుండి వేరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆర్డీఎస్ఎస్ ప్రాజెక్ట్ పనుల్లో స్తంభాల ఏర్పాటు, మెటీరియల్ రవాణా మార్గాల విషయాల్లో రైతుల నుండి ఎదురవుతున్న అభ్యంతరాలను, స్థానిక గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో వెంటనే పరిష్కరించాలని ఎంపీడీఓ అధికారులకు సూచించారు. లక్ష్యంగా పెట్టుకున్న 12,000 సోలార్ కనెక్షన్లలో ఇప్పటివరకు 8,000 పూర్తి చేయడం పట్ల ప్రశంసలు వ్యక్తమయ్యాయి. మిగిలిన ఇన్‌స్టాలేషన్లను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ఎస్సీ, ఎస్టీ వర్గాల ఇళ్లలో పెద్ద ఎత్తున సోలార్ సిస్టమ్‌ల ఏర్పాటు ప్రక్రియ వేగంగా జరగాలని స్పష్టం చేశారు. పారిశుధ్య నిర్వహణ పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రోజూ పిఆర్ 5 యాప్‌లో పారిశుధ్య పనుల వివరాలను అప్‌లోడ్ చేయడమే కాకుండా, ప్రజలకు స్పష్టంగా కనిపించేలా క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావాలన్నారు. స్వచ్ఛాంధ్ర పోర్టల్‌లో నిర్దేశిత 5 గ్రామాల డేటాను నిర్ణీత గడువు లోగా తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. రాబోయే 30 రోజుల్లో పారిశుధ్య వ్యవస్థ పై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. నెలకు రూ. 10,000 గౌరవ వేతనం అందుకుంటున్న క్లాప్ మిత్రలు సరిగ్గా పనిచేసేలా చూడాలన్నారు. ప్రతిరోజూ కనీసం 250 గృహాల నుండి చెత్తను సేకరించేలా చర్యలు తీసుకోవాలని, సేకరించిన చెత్తను చెరువులు లేదా ఇతర జలాశయాల్లో పారబోయకుండా చూడాలని హెచ్చరించారు. అక్టోబర్ 2 నాటికి అంగన్‌వాడీల పనులు పూర్తి కావాలని, ప్రతి సచివాలయంలో సమాచార బోర్డులు ఏర్పాటు చేసి, అవగాహన సదస్సులు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించి మంజూరైన 1,171 పనులలో పెండింగ్‌లో ఉన్న 38 పనులను రేపటికల్లా ప్రారంభించాలని కలెక్టర్ హెచ్చరించారు. జలధార మరియు జలహారతి ప్రోగ్రామ్‌ల కింద ఉన్న 2,000 ఎంఐ ట్యాంకుల డిసిల్టేషన్ (పూడిక తీత) పనులు ఏవీ పెండింగ్ లేకుండా త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. డిఆర్డిఏ ద్వారా పంపిణీ చేస్తున్న పింఛన్ల పై దిశా నిర్దేశం చేశారు.

ప్రజలకు అవసర మైన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని, శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రాబోయే వారంలో ప్రతి మండలంలో పెండింగ్ పనులన్నీ పూర్తికావాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ఈ సమావేశంలో కలెక్టరేట్ నుంచి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ రాజ్ కుమార్, డిపిఓ సందీప్, డ్వామా పిడి నిర్మల దేవి, ఆర్ డబ్ల్యూ ఎస్, ఎస్ఈ అనిల్ కుమార్, డిఆర్డిఏ, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బి, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారంలో చురుగ్గా వ్యవహరించాలి.

✷ అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్.

✷ పీజీఆర్ఎస్ లో పలు సమస్యల పై 318 వినతులు సమర్పించిన ప్రజలు.



**విశాఖపట్టణం, పెన్ సత్తా, సెప్టెంబర్ 07:** ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు చురుగ్గా వ్యవహరించాలని, నిర్ణీత సమయం లోగా నాణ్యమైన పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ మీటింగు హాలులో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఆయన వివిధ అంశాల పై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజల నుంచి అందే ప్రతి ఫిర్యాదునూ క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని, సంబంధిత ఫిర్యాదుదారుతో మాట్లాడి చర్యలు తీసుకోవాలన్నారు. ఏ దశలోనూ నిర్లక్ష్యం ప్రదర్శించరాదని, పీజీఆర్ఎస్ వేదికగా అందే వినతుల పరిష్కారం కోసం ప్రత్యేక సమయం కేటాయించాలని, ప్రజలు సంతృప్తి చెందే విధంగా అధికారుల కార్యాచరణ, చర్యలు ఉండాలని కలెక్టర్ హితవు పలికారు. ఇదిలా ఉండగా సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ వేదికగా ప్రజలు వివిధ సమస్యల పై 318 వినతులు సమర్పించారు. అందులో రెవెన్యూ విభాగానికి చెందినవి 30, జీవీఎంసీవి 71, పోలీస్ శాఖ 26, ఇరత విభాగాలకు చెందినవి 191 ఉన్నాయి. కలెక్టర్ తో పాటు, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవో సంగీత్ మాథుర్, డిప్యూటీ కలెక్టర్ టి. గోవిందు, అడిషనల్ కమిషనర్ రమేశ్ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అన్ని శాఖల అధికారులు పాల్గొని వినతులను నమోదు చేసుకున్నారు.

# పరవాడ లో ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణంచేయాలి.

సిఐటియు నాయకులు గనిశెట్టి డిమాండ్.



**పరవాడ, పెన్ సత్తా, సెప్టెంబర్ 07**: మండల కేంద్ర మైన పరవాడలో ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం కోసం సర్వే నెంబర్ 259 లో 1.43 భూమి కేటాయించినప్పటికీ ప్రభుత్వం నిధులు విడుదల చేసి ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేయాలని సిఐటియు నాయకులు గనిశెట్టి డిమాండ్. ఆసుపత్రి నిర్మాణం చేయకపోవడం వలన ఎన్టిపిసి, ఫార్మాసిటీ, ఇండస్ట్రియల్ పార్కులో సుమారు 23,000 మంది ఈఎస్ఐ బీమా కడుతున్న కార్మికులకు ఈ ఎస్ ఎస్ సేవలు అందడం లేదని అన్నారు. పరిశ్రమల ప్రమాదాలు జరిగినప్పుడు గాయపడ్డ కార్మికులను విశాఖపట్నం తరలించే లోపు మార్గం మధ్యలో మృతి చెందుతున్నారని వెంటనే పరవాడలో బర్న్ వార్డ్ తో ఈఎస్ఐ ఆసుపత్రి నిర్మాణం చేయాలని సోమవారం జిల్లా కలెక్టర్ కు సిఐటియు జిల్లా నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ ఫిర్యాదు కాపీని అందజేశారు. అనంతరం ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ అనకాపల్లి జిల్లా పీకే పీ ప్రసాద కి మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా వారిని వెంటనే ఈఎస్ఐ హాస్పిటల్ నిర్మాణం చేసి ఫార్మా, ఎన్టిపిసి, ఇండస్ట్రియల్ పార్క్ కార్మికులకు ఈ ఎస్ ఐ సేవలు అందించాలని గనిశెట్టి కోరారు.

# ధర్మవరంలో అధిక వడ్డీల వ్యవహారం పై పోలీసుల దృష్టి.

✷ అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్న 8 మందికి డీఎస్పీ కౌన్సెలింగ్.

✷ డబ్బుల వసూళ్ల పేరుతో రుణగ్రహీతలను వేధిస్తే చర్యలు డీఎస్పీ.

✷ అప్పు తీసుకున్న వారి ఇళ్ల వద్దకు వెళ్లి గొడవలు, బెదిరింపులు చేస్తే కఠిన చర్యలు.

✷ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని అప్పులు ఇచ్చే వారికి సూచన.

✷ అధిక వడ్డీల వ్యవహారంలో వేధింపులకు గురైతే పోలీసులకు ఫిర్యాదు చేయండి.

✷ రుణగ్రహీతలను బెదిరించడం, వేధించడం చేస్తే చట్టపర మైన చర్యలు తప్పవు డీఎస్పీ బి.వి. జగన్నాథ్‌రాజు.




**ధర్మవరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 07:**అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్నట్లు గుర్తించిన ఎనిమిది మందిని శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం డీఎస్పీ కార్యాలయానికి పిలిపించి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. అప్పు తీసుకున్న వ్యక్తులు సకాలంలో డబ్బులు చెల్లించలేదనే కారణంతో వారి ఇళ్ల వద్దకు వెళ్లి గొడవలు చేయడం, బెదిరించడం, అసభ్యంగా ప్రవర్తించడం లేదా ఇతర విధాలుగా వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ బి.వి. జగన్నాథ్ రాజు తెలిపారు. అధిక వడ్డీలకు అప్పులు ఇస్తున్న కొంతమందిని గుర్తించి, వారికి చట్టపర మైన అంశాల పై అవగాహన కల్పించేందుకు కౌన్సెలింగ్ నిర్వహించినట్లు డీఎస్పీ తెలిపారు. అప్పుల వసూళ్ల విషయంలో ఎవరూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. రుణగ్రహీతలను వేధించడం, బెదిరించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపర మైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అధిక వడ్డీల వ్యవహారంలో ఎవరైనా వేధింపులకు గురైతే సమీప పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని డీఎస్పీ సూచించారు.

## స్వచ్ఛమైన గాలి కోసం బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీ




**విశాఖపట్నం పెన్ సత్తా, సెప్టెంబర్ 07:** స్వచ్ఛ వాయు దివస్ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం బీచ్‌రోడ్డులో అవగాహన ర్యాలీ, మొక్కలు నాటే కార్యక్రమాలను నిర్వహించారు. ప్రజల్లో వాయు కాలుష్యంపై అవగాహన కల్పించడం, స్వచ్ఛమైన గాలి ప్రాధాన్యతను వివరించడం, పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలను చేపట్టారు.

కాళీమాత ఆలయం నుంచి ప్రారంభమైన అవగాహన ర్యాలీ బీచ్‌రోడ్డులో కొనసాగింది. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్ పి. కృష్ణయ్య, పోర్టు చైర్మన్ జస్మిత్ సింగ్ బింద్రా, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, వీపీఏ వైస్ చైర్‌పర్సన్ రోషణి అపరంజి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు.

ర్యాలీ అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. స్వచ్ఛమైన గాలి కోసం కాలుష్య నియంత్రణ చర్యలను పాటించడంతో పాటు, పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా మొక్కలు నాటాలని కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు సూచించారు.

స్థానిక కాలుష్య నియంత్రణ మండలి ఈఈ ముకుందరావు, ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు, జీవీఎంసీ అధికారులు, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అపర భగీరథుడు చంద్రబాబు



**భీమిలి , పెన్ సత్తా, సెప్టెంబర్ 07:** ఉత్తరాంధ్ర ప్రజల ఐదు దశాబ్దాల కలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సాకారం చేశారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గ సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు అన్నారు.

పోలవరం ఎడమ కాలువ నుంచి అనకాపల్లికి గోదావరి జలాలను విడుదల చేయడం అభినందనీయమన్నారు. రాబోయే ఏడాదిలో విశాఖకు గోదావరి జలాలను తీసుకువచ్చి నగర ప్రజల తాగునీటి సమస్యకు పరిష్కారం చూపనున్నారని తెలిపారు. నీరు ఉంటేనే వ్యవసాయం, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు సాధ్యమవుతాయని పేర్కొన్నారు.

రాష్ట్రంలోని నదుల అనుసంధానానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తున్నారని గంటా నూకరాజు పేర్కొన్నారు

## స్వచ్ఛమైన గాలి కోసం ప్రతి విద్యార్థి కృషి చేయాలి



**విశాఖపట్నం, పెన్ సత్తా, సెప్టెంబర్ 07:** :అంతర్జాతీయ స్వచ్ఛమైన గాలి-- నీలి ఆకాశ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఉమెన్స్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ. విజయ బాబు పిలుపునిచ్చారు. కళాశాలలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి, ఎస్ఆర్‌యూ--జీవీఎంసీ, గ్రీన్ క్లైమేట్ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 10 వేల విత్తనాల బంతులతో ప్రదర్శన నిర్వహించారు. అలాగే 5 వేల దేశీయ కూరగాయల నారు మొక్కలను నాటారు. ప్రతి విద్యార్థి పర్యావరణ హితంగా జీవించాలని, ప్రకృతి ఆధారిత పంటలను పండించి వినియోగించాలని విజయ బాబు సూచించారు. విత్తనాల బంతులతో సామాజిక వనాలను పెంచాలని కోరారు.

గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం మాట్లాడుతూ వాయు కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన గాలి ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడమే దినోత్సవ లక్ష్యమన్నారు. ప్రతి విద్యార్థి ఏటా కనీసం వంద విత్తనాల బంతులు తయారు చేసి సామాజిక వనాల పెంపునకు కృషి చేయాలని కోరారు.

కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, ఎస్ఆర్‌యూ--జీవీఎంసీ ప్రతినిధి మంగరాజు, ఏక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ. కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

# లోటు వర్షపాతం నేపథ్యంలో నీటి వనరుల పై ప్రత్యేక దృష్టి కలెక్టర్ కృష్ణన్



**అనకాపల్లి, పెన్ సత్తా, సెప్టెంబర్ 07:** ప్రస్తుత నైరుతి రుతుపవన కాలంలో జిల్లాలో 54.85 శాతం లోటు వర్షపాతం నమోదైన నేపథ్యంలో జిల్లా లోని నీటి వనరుల పరిస్థితి పై జల వనరుల శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం ఇరిగేషన్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌నినో పరిస్థితుల ప్రభావంతో ప్రధాన, మధ్యతరహా రిజర్వాయర్లు, చిన్నతరహా నీటిపారుదల వనరుల్లోకి నీటి ప్రవాహాలు గణనీయంగా తగ్గినట్లు ఇరిగేషన్ అధికారులు జిల్లా కలెక్టర్ కు తెలిపారు.

**ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జిల్లాలో నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన వివిధ అంశాల పై సమీక్షించారు.**

అనకాపల్లి జిల్లాలో ఒక ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టు, మూడు మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులు, 2,880 చిన్నతరహా నీటిపారుదల వనరులు ఉన్నాయి. వీటిలో చెరువులు, ఆనకట్లు, గ్రోయిన్లు, చెక్‌డ్యామ్‌లు ఉన్నాయి. జిల్లాలో ప్రధానంగా తాండవ, శారద, వరాహ నదులు ప్రవహిస్తున్నాయి. జిల్లాలో ఒక ప్రధాన నీటిపారుదల ప్రాజెక్టు అయిన రాజా సాగి సూర్యనారాయణ రాజు తాండవ జలాశయం, మూడు మధ్యతరహా నీటిపారుదల ప్రాజెక్టులు అయిన వరద నారాయణ మూర్తి రైవాడ జలాశయం, తెన్నేటి విశ్వనాథం పెద్దేరు జలాశయం, వెచ్చలపు పాలవెల్లి కోనాం జలాశయాలు ఉన్నాయి. వీటితో పాటు చెరువులు, ఆనికట్లు, గ్రాయిన్లు, చెక్ డ్యామ్‌లు తదితర 2,880 చిన్నతరహా నీటివనరులు జిల్లాలో ఉన్నాయి.

**రాజా సాగి సూర్యనారాయణ రాజు తాండవ జలాశయ ప్రాజెక్టు**

జలాశయం యొక్క మొత్తం స్థూల నిల్వ సామర్థ్యం: 4,960 మిలియన్ క్యూబిక్ ఫీట్లు (ఎంసీఎఫ్టీ), మొత్తం వినియోగించదగిన నిల్వ సామర్థ్యం: 4,400 ఎంసీఎఫ్టీ, డెడ్ స్టోరేజ్: 560 ఎంసీఎఫ్టీ, ప్రస్తుత వినియోగించదగిన నీటి నిల్వ: 2,146 ఎంసీఎఫ్టీ, ఇది మొత్తం లైవ్ స్టోరేజ్‌లో 48.77 శాతం, ఆయకట్టు: 51,465 ఎకరాలు, అనకాపల్లి: 32,689 ఎకరాలు, కాకినాడ: 18,776 ఎకరాలు, ఖరీఫ్ 2026కు నీటిని 11-08-2026న విడుదల చేశారు. ఇప్పటివరకు నాట్లు వేసిన ఆయకట్టు: 10,500 ఎకరాలు గా వున్నాయి. వరద నారాయణమూర్తి రైవాడ జలాశయ ప్రాజెక్టు యొక్క మొత్తం స్థూల నిల్వ సామర్థ్యం: 3,600 ఎంసీఎఫ్టీ, మొత్తం లైవ్ స్టోరేజ్ సామర్థ్యం: 3,275 ఎంసీఎఫ్టీ, డెడ్ స్టోరేజ్: 325 ఎంసీఎఫ్టీ, ప్రస్తుత లైవ్ స్టోరేజ్: 609 ఎంసీఎఫ్టీ, ఇది మొత్తం లైవ్ స్టోరేజ్‌లో 18.59 శాతం. జీవీఎంసీ కు తాగునీటి అవసరాల కోసం 50 క్యూసెక్కుల చొప్పున 1.582 టీఎంసీ నీరు అవసరం. ఆయకట్టు: 15,344 ఎకరాలు, ఖరీఫ్ 2026కు నీటిని 23-07-2026న విడుదల చేశారు. ఇప్పటివరకు నాట్లు వేసిన ఆయకట్టు: 5,530 ఎకరాలు. వెచ్చలపు పాలవెల్లి కోనాం జలాశయ ప్రాజెక్టు యొక్క మొత్తం స్థూల నిల్వ సామర్థ్యం: 850 ఎంసీఎఫ్టీ, మొత్తం లైవ్ స్టోరేజ్ సామర్థ్యం: 833 ఎంసీఎఫ్టీ, డెడ్ స్టోరేజ్: 17 ఎంసీఎఫ్టీ, ప్రస్తుత లైవ్ స్టోరేజ్: 116 ఎంసీఎఫ్టీ, ఇది మొత్తం లైవ్ స్టోరేజ్‌లో 13.92 శాతం, ఆయకట్టు: 12,276 ఎకరాలు, ఖరీఫ్ 2026కు నీటిని 16-08-2026న విడుదల చేశారు. ఇప్పటివరకు నాట్లు వేసిన ఆయకట్టు 1,150 ఎకరాలు. తెన్నేటి విశ్వనాథం పెద్దేరు జలాశయ ప్రాజెక్టు యొక్క మొత్తం స్థూల నిల్వ సామర్థ్యం: 358 ఎంసీఎఫ్టీ, మొత్తం లైవ్ స్టోరేజ్ సామర్థ్యం: 320.25 ఎంసీఎఫ్టీ, డెడ్ స్టోరేజ్: 37.75 ఎంసీఎఫ్టీ, ప్రస్తుత లైవ్ స్టోరేజ్: 20.25 ఎంసీఎఫ్టీ, ఇది మొత్తం లైవ్ స్టోరేజ్‌లో 6.32 శాతం, ఆయకట్టు: 15,105 ఎకరాలు. ఖరీఫ్ 2026కు నీటిని 30-07-2026న విడుదల చేశారు. ఇప్పటివరకు నాట్లు వేసిన ఆయకట్టు 5,440 ఎకరాలు. గుడివాడ గురునాథ రావు వరాహ జలాశయ ప్రాజెక్టు యొక్క

మొత్తం స్థూల నిల్వ సామర్థ్యం 465 ఎంసీఎఫ్టీ, మొత్తం లైవ్ స్టోరేజ్ సామర్థ్యం 431 ఎంసీఎఫ్టీ, డెడ్ స్టోరేజ్ 34 ఎంసీఎఫ్టీ, ప్రస్తుత లైవ్ స్టోరేజ్ 108 ఎంసీఎఫ్టీ, ఇది మొత్తం లైవ్ స్టోరేజ్‌లో 25.06 శాతం. ఖరీఫ్ 2026కు నీటిని 13-08-2026న విడుదల చేశారు. ఇప్పటివరకు నాట్లు వేసిన ఆయకట్టు 1,200 ఎకరాలు.

ప్రస్తుతం అందుబాటులో ఉన్న నీటి నిల్వలను దృష్టిలో ఉంచుకుని, తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, సురక్షితంగా అందించగల వాస్తవిక సాగునీటి సామర్థ్యం, జలాశయాల నీటి విడుదల షెడ్యూల్ తదితర అంశాలను పరిగణన లోకి తీసుకుని నీటి నియంత్రణ చేపడుతున్నారు. అవసర మైన ప్రాంతాల్లో వారాబందీ విధానంలో రొటేషనల్ నీటి సరఫరా అమలు చేస్తూ, అందుబాటులో ఉన్న నీటిని రైతులందరికీ సమానంగా, న్యాయబద్ధంగా పంపిణీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నారు.

# ఎన్‌టీఆర్ భరోసా పెన్షన్లకు దరఖాస్తుల స్వీకరణ



**ఆనందపురం,, పెన్ సత్తా, సెప్టెంబర్ 07:** :ఎన్‌టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ పథకం కింద నూతన పెన్షన్ల కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆనందపురం మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. సత్యనారాయణ తెలిపారు.ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు సెప్టెంబర్ 7 నుంచి 16వ తేదీ వరకు అర్హులైన వారు తమ సంబంధిత స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డు, బియ్యం కార్డు లేదా ఆదాయ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత కేటగిరీకి అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.దరఖాస్తులను ఈ-కేవైసీ, అర్హత ప్రమాణాలు, ధ్రువపత్రాలు, క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా అధికారులు పరిశీలించనున్నారు. వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళలు, దివ్యాంగుల పెన్షన్లకు సంబంధించి అర్హత ఉన్న దరఖాస్తులను మాత్రమే మండల పరిషత్ అభివృద్ధి అధికారి స్థాయిలో సిఫార్సు చేస్తారని తెలిపారు.పెన్షన్ మంజూరు చేసే అధికారం మండల పరిషత్ అభివృద్ధి అధికారికి లేదని, తుది మంజూరు ప్రభుత్వం ఆమోదం, బడ్జెట్ లభ్యతకు

లోబడి ఉంటుందని స్పష్టం చేశారు. పెన్షన్ మంజూరైన నెల నుంచే చెల్లింపులు ప్రారంభమవుతాయని, దరఖాస్తు చేసిన తేదీ నుంచి గత కాలానికి పెన్షన్ చెల్లింపు ఉండదని పేర్కొన్నారు.అర్హులైన ప్రజలు నిర్ణీత గడువులో అవసరమైన ధ్రువపత్రాలతో సంబంధిత స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

## భోగాపురం ఘటనలో బాధితుడికి భరోసా కల్పించిన ఎస్పీకి డీవీఎంసీ సభ్యుల అభినందనలు

**విజయనగరం, పెన్ సత్తా, సెప్టెంబర్ 07:** భోగాపురంలో దళిత యువకుడిని తాళ్లతో నిర్బంధించి అమానవీయంగా ప్రవర్తించిన ఘటనపై జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఐపీఎస్ తక్షణమే స్పందించి బాధితుడికి అండగా నిలవడాన్ని ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం, పౌర హక్కుల జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు అభినందించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని కలిసిన డీవీఎంసీ సభ్యుల బృందం ఆయనను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేసింది. ఈ సందర్భంగా సభ్యుడు పెంకి చిట్టిబాబు మాట్లాడుతూ.. సంఘటన సమాచారం అందిన వెంటనే ఎస్పీ స్వయంగా స్పందించి, పోలీసు అధికారులను అప్రమత్తం చేసి కేసు నమోదు చేయడంతో పాటు గంట వ్యవధిలోనే నిందితులను అదుపులోకి తీసుకోవడం అభినందనీయమన్నారు.

బాధితులు, సాక్షుల హక్కులను పరిరక్షిస్తూ, 24 గంటల్లో నిందితులను న్యాయస్థానానికి హాజరుపరిచిన పోలీసుశాఖ




చర్యలతో బాధిత వర్గాల్లో నమ్మకం పెరిగిందన్నారు. బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి చట్ట స్ఫూర్తిని కాపాడిన ఎస్పీ చర్యలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీవీఎంసీ సభ్యులు పి. చిట్టిబాబు, బసవ సూర్యనారాయణ, రమేష్, చేయూత సంస్థ అధ్యక్షుడు ముడిదాపు రాము, సిటిజన్స్ విజిలెన్స్ కమిటీ జిల్లా కన్వీనర్ ఎం.పి. రాజు, రాష్ట్ర కన్వీనర్ కే.సి.హెచ్. బంగారు రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి సీపీ తక్షణ ఆదేశాలు

### పీజీఆర్ఎస్‌కు 100 ఫిర్యాదులు

**పెన్ సత్తా, సెప్టెంబర్ 07:** ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు విశాఖపట్నం నగర పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్) 100 ఫిర్యాదులు అందాయి. నగర పోలీసు కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పోలీసు కమిషనర్ డాక్టర్ శంఖబ్రత భాగ్చి ఫిర్యాదుదారుల నుంచి నేరుగా వినతులు స్వీకరించారు.ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడిన కమిషనర్ వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత సబ్ డివిజన్ సహాయ పోలీసు కమిషనర్లు, పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి, ప్రతి ఫిర్యాదుపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు.

పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, భార్యాభర్తల మధ్య వివాదాలు, భూ సమస్యలు, మోసాలు, సివిల్ వివాదాలకు సంబంధించిన అంశాలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

